కవరు కథలు

లెఫ్టినెంట్ మిస్ పి. వకుళ

భర్తను ఆఫీసుకు పంపి ఇంట్లోకి వచ్చేసరికి బాబిగాడు అరుగుమీద కూర్చుని అంటుకున్నాడు. వాడికి పాలు పట్టి భోజనం చేద్దామని ప్లాస్కులో కలిపి పెట్టిన పాలు సీసాలో పోసి పడుతూ కూర్చుంది శాంత.

"పోస్ట్!" అన్న కేకతో ఉలిక్కిపడి బయటకు వచ్చి కవరు అందుకుని చూసింది. "శ్రీమతి శాంతాదేవి, కేరాఫ్ రాజారావు." 'ప్రత్యేకంగా తనకు లెటరు రాసినవాళ్లు ఎవరబ్బా' అనుకుంటూ ఫ్రమ్ అడ్రెస్ చూడబోతే, లేదు. ఎన్నో ఆలోచనంతో కవరు చింపి క్రింద సంతకం చూసింది. "ఇట్లు. నీ, చండి" అని చూసి సంతోషం పట్టలేకపోయింది శాంత.

"విశాఖపట్నం,
26—2—72.

ప్రియమైన శాంతా,

ఎవరబ్బా అని ఆశ్చర్యపోతున్నావుగదా? క్రింద సంతకం చూడకుండా చెప్పుకో చూద్దాం మరి? నాకు తెలుసు, నువ్వు చెప్పలేవులే! నేను, తల్లీ, పాతచింతకాయ పచ్చడి లాంటి నీ స్నేహితురాలు 'చండిక'ను. హమ్మయ్య, గుర్తుకొచ్చాను గదా?

శాంతా, నీకు ఒక సంతోషకరమైన వార్త చెప్పనా? ఏమిటో చెప్పుకో మరి? ఊహూ నువ్వు చెప్పలేవుగాని, నేనేచెపుతాను. మరి, నా కేమిస్తావు? మీ బాబిగాడితో నన్ను ఆడుకోనిస్తావూ? ఈ సంగతి నా కెలా తెలిసిందని ఆశ్చర్యపోతున్నావు గదూ? పది రోజుల క్రితం విజయవాడ స్టేషనులో మీ అమ్మగారు కనిపించి చెప్పారు. ఇంతకూ నేను చెపుతానన్న విషయం చెప్పనేలేదు గదా? ఓపిక పట్టు మరి. అంత తొందరపడితే ఎలాగు? వచ్చే నెల (మార్చి) 6 వ తేదీని ఢిల్లీలో నాకు ఇంటర్వ్యూ ఉంది. నేను 4 వ తేదీ రాత్రి ఇక్కడ బయలుదేరుదా మనుకుంటున్నాను. స్టేషన్‌లో దిగాక మీ ఇంటికి ఎలా రావాలో కొంచెం వివరంగా రాయి. అంటే, సిటీ సర్వీస్ వగైరా అన్న మాట. అలా కాని పక్షంలో నువ్వుగాని, మీ శ్రీవారుగాని ఆ రోజు స్టేషన్‌కు వచ్చినా సరే. మీ వారు నన్ను గుర్తుపట్టగలరుగదా? పెళ్లిలో నేను ఆయన కూర్చోబోయే పడకకుర్చీ కర్ర తీసేసిన విషయం బహుశా మరిచిపోయి ఉండరు.

మీ బాబిగాడు ఎలా ఉన్నాడు? నీకులాగా తెల్లగా, బొద్దుగా ఉన్నాడా, లేక మీ వారిలాగా ఉన్నాడా? నీకులాగా ఉంటేనే ఎత్తుకుంటాను. లేకపోతే వాడిని మీ శ్రీవారికి అప్పచెప్పి, మనం ఇద్దరమూ కలిసి ఢిల్లీ అంతా తిరిగేద్దాము. ఏమంటావు? ఈ లెటరు చేరగానే త్వరగా రిప్లై రాయి. మీ 'నల్లబంగారం'ను అడిగినట్లుగా చెప్పు. ఎంతకు? వద్దులే, తల్లీ, మా ఇంట్లో బస్తా నిండుగా ఉన్నాయి. ఉంటాను మరి.

నీ
చండి."

లెటరు చదివిన శాంతకు సంతోషం ఆగలేదు. కవరు చేతిలో పట్టుకొని అలాగే గతంలోకి జారిపోయింది.

తను, చండిక స్కూలుకు వెళ్లే రోజులలో ఎలా ఉండేవారు? చండికను చూసి టీచర్లంతా 'పేరుకు తగ్గ పిల్ల' అనేవాళ్లు. ఆ మాటే పిల్లలు గనక ఎవరయినా అంటే, నిజంగా 'చండి' అవతారం ఎత్తేసేది. తమ పేర్లు ఎంత వ్యతిరేకమో, అంతగా కలిసి తిరిగేవాళ్లు. తెలిసిన వాళ్లంతా తమ పేర్లు గుర్తుకు తెచ్చుకొని నవ్వుకొనేవాళ్లు. కాని, చండిక మనస్తత్త్వం మాత్రం పేరుకు పూర్తిగా విరుద్ధం. ఆ సంగతి తన కొకత్తికే తెలుసు. ముఖ్యంగా తనంటే ప్రాణం పెట్టేది. అంతకన్నా అభిమానం తనకు ఆమెమీద. తన ఇంట్లో అమ్మ, నాన్న, అన్నయ్యలుకూడా చండిక అంటే చాలా అభిమానించేవారు. వాళ్ల అమ్మ, నాన్నలకు తను ఒక్కత్తే కావటంతో పసిపిల్లలంటే చాలా పిచ్చి. తమ ఇళ్లుకూడా ప్రక్క ప్రక్కనే కావటంతో అన్నయ్య కొడుకు వాళ్ల ఇంట్లోగాని, తన ఇంట్లోగాని ఎప్పుడూ తనతోనే ఉండేవాడు. రానురాను వాడు ఒక్క పాల కోసం తప్పించి, వదిన దగ్గరకుకూడా రావటం మానేశాడు.

ఎస్. ఎస్. ఎల్. సి. పాసయ్యాక చండిక కాలేజీలో చేరింది. తనను మాత్రం చదువు మానిపించి నాన్న, అన్నయ్య వరాన్వేషణలో పడ్డారు. ఆ ప్రయత్నం ప్రయత్నం, చండికకు బి. ఎ. అయిపోయిన సంవత్సరం, తనకు రాజారావుతో సంబంధం స్థిరపడటం జరిగింది. చండికకు ఉన్న ఊళ్లోనే పదువవటంతో తమ స్నేహితుకు ఆటంకం ఏర్పడలేదు. ఇంట్లో ఉన్న నాలుగు సంవత్సరాలు తనకుకూడా కాలేజీలో చేరమని ఒకటే పోరేది. కాని, ఆమె మాటలు, ముఖ్యంగా పెళ్లిని గురించి, కలలో తేలిపోతున్న తను పెడచెవిని పెట్టింది.

పెళ్లిచూపులరోజు ఎంత గొడవ చేసింది? పెళ్లికొడుకు తరఫున చెప్పుకోదగ్గ బంధువులు లేకపోవటంతో, ఒక స్నేహితుని వెంటబెట్టుకొని వచ్చారు. తనతోపాటు ఆమెనుకూడా హాలులోకి రమ్మంటే, 'ఇంకానయం. మన ఇద్దరిలో పెళ్లికూతురు ఎవరో తెలియక ఇబ్బంది పడతారు' అంది. చివరి కెలాగయితేనేం, అమ్మ, వదిన చెప్పగా తనతోపాటు వచ్చి కూర్చుని, 'ఈమె కుమారి శాంతా దేవి. నా స్నేహితురాలు. నేను చండిక బి. ఎ.' అని చెప్పేసింది. నాన్న, అన్నయ్యలకు ఇలాంటి మాటలు అలవాటే గనక నవ్వేసి ఊరుకున్నారు. కాని, ఆయన, ఆయన స్నేహితుడు ఈ అమ్మాయి చొరవకు ఆశ్చర్యపోయినా, తరవాత నవ్వేశారు.

ఆ తరవాత నెల రోజులు తిరక్కుండానే తనకు రాజారావుతో పెళ్లి పోషటం, తను వారి ఉద్యోగరీత్యా ఢిల్లీలో కాపురం పెట్టటం జరిగిపోయాయి. చండిక ఎమ్. ఎ. (సైజాగ్) లో చేరినట్లు, వాళ్ల నాన్నగారు అక్కడికే ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వెళ్లిపోయినట్లు తను పుట్టింటికి విజయవాడ వెళ్లినప్పుడు తెలిసింది.

బాబిగాడి ఏడుపుతో ఈ లోకంలోకి వచ్చిన శాంతకు ఎదురుగా టేబుల్ మీద టైమ్‌పీస్ పన్నెండు గంటలు చూపించింది. 'అయ్యో, ఈ లెటరు సర్దాలో పడి భోజనంకూడా మరిచిపోయా'ననుకొని, ఒక నిద్ర పోయి లేచిన బాబిగాడికి మళ్లా పాలు పట్టి పడుకో బెట్టింది. భోజనానికి కూర్చున్నదేగాని, స్నేహితురాలి లెటరుతోనే కడుపు నిండిపోయిన శాంత ఎలాగో తిన్నానని పించి, లెటరు రాయడానికి కూర్చుంది.

లెటర్‌పాడ్‌లో లెటరు రాసిన పేపర్స్ చింపి, కవరుకోసం టేబుల్ సొరుగు లాగి చూస్తే, లేదు. భర్త ఇంకా సామాన్యంగా పెట్టే స్థలాలన్నీ వెతికింది గాని, దొరక లేదు. ఇంక చేసేది లేక చిల్లర డబ్బుల కోసం వెతికి, చివరి కెలాగయితేనేం పోపులపెట్టెలో ఇరవై పైసలు దొరికే సరికి ప్రాణం లేచి వచ్చింది శాంతకు. అవి పట్టుకొని పక్కింటి వాళ్ల రాము కోసం చూస్తే, వాడింకా స్కూలునుండి రాలేదని వాళ్లమ్మగారు చెప్పారు. 1—30 వరకు వాడి కోసం కాపలా కాసి, వాడు భోజనం చేసి వచ్చేవరకు ఓపికతో కూర్చుని, డబ్బా అడుగుకు పోయిన పంచదార వాడి చేతిలో పెట్టి కవరు తెమ్మని వాడిని పోస్టాఫీసుకు పంపింది. వాడుపోతూపోతూ, "అక్కా, 20 పైసల కవరు లేకపోతే తిరిగొస్తాను" అంటూ ఇంకొక మాట చెప్పటానికి అవకాశం లేకుండా పరుగెట్టాడు.

అలా పోయినవాడు పది నిమిషాలలో తిరిగొచ్చి, "అక్కా, కవరు 25 పైసలట. నా స్కూలుకు టైమైపోతోంది" అని ఆ డబ్బులు గుమ్మంలో పడేసి పరుగెట్టి పోయాడు. స్నేహితురాలి లెటరు చదువుకొని ఎంత సంతోషపడ్డదో, ఇప్పుడు అంత నిరుత్సాహ పడిపోయింది శాంత. తన దగ్గర ఉన్న పది రూపాయలుకూడా నిన్న పక్కింటి పిన్నిగారు అడిగితే ఇచ్చింది. ఆయన వచ్చేసరికి సాయంకాలం 5 గంటలు దాటిపోతుంది. ఇక ఈ రోజుకు లెటరు పోస్టు చెయ్యటం పడదేమోనని బెంగతో ఇల్లంతా ఇంకొకసారి వెతికింది. కాని, ఎక్కడా అయిదు పైసలు దొరక లేదు. కాలెండరు చూసిన శాంత, 'అయ్యో, ఈ రోజు శనివారం. రేపు ఆదివారంకూడానే! ఎలాగు?' అన్ని దిగులు

పెట్టుకుంది. 'తను 4 వ తేది బయలు దేరుతానంది. సోమవారం లెటరు రాస్తే చేరదు.' ఇలా ఆలోచించిన శాంతకు కళ్లనిండుగా నీళ్లు వచ్చాయి. వెనకా ముందూ చూసుకోకుండా నిన్న పిన్ని గారు అడగగానే పది రూపాయలు ఇచ్చి నందుకు తనను తనే తిట్టుకుంది. ఆ కోపంలో అప్పుడే నిద్ర లేచి ఆకలితో ఏడుస్తున్న బాబిగాడిని రెండు వాయిం చింది. ఇంతకు ముం దెప్పుడూ తల్లి ప్రేమనేగాని, కోపాన్ని చూడని వాడు ఇంకా ఇల్లెగిరిపోయేలాగ ఏడవటం మొదలుపెట్టాడు. వాడి ఏడుపు విని ఖంగారుగా వచ్చిన పక్కింటి పిన్నిగారు, "ఏమమ్మా, శాంతా, నువ్వు ఇక్కడే ఉన్నావా? ఏదయినా పనిలో ఉన్నావేమో, వాడు ఏడుస్తున్నాడని వచ్చాను. .అరె, అదేమిటి, నీ కళ్లలో నీళ్లు?" అన్నారు.

శాంత సిగ్గుపడిపోయింది. "అబ్బే, ఏం లేదండి. కంట్లో నలక పడిలేను."

"ఇదేమిటి? ఎవరికో లెటరు రాసిన ట్లున్నావు. పోస్టు చెయ్యాలా? మా పెద్దబ్బాయి ఉన్నాడు. పంపుతాను."

"ఇప్పుడు కవరు లేదు. సోమవారం పోస్టు చెయ్యవచ్చులెండి" అంది ఎంతో బాధపడిపోతూ.

"అదేమిటమ్మా, కవరు లేకపోయినంత మాత్రాన లెటరు పోస్టు చెయ్యటం మానుకోవాలా? పక్కన ఉన్నాము గదా, అమాత్రం అడగగూడదూ? మేము తెస్తానుండు" అని, శాంత కాదంటున్నా వినకుండా వెళ్లి రెండు నిమిషాలలో కవరుతో తిరిగి వచ్చింది. అప్పటికప్పుడు కవరుమీద అడ్రెసు రాయించి, వాళ్ల అబ్బాయిచేత పోస్టు చేయించటానికి తీసు కెళ్లారావిడ. శాంత మనసు చాలా తేలికై పోయి, చిన్న విషయానికి ఇంత బెంగపడి పోయినందుకు సిగ్గుపడి, 'తన కోప మంతా బాబిగాడిమీద చూపించానే' అని వాడిని హృదయానికి హత్తుకొని ముద్దులతో నింపేసింది.

ఆ సాయంకాలం త్వరత్వరగా పని ముగించుకొని తన స్నేహితురాలి ఆగమన వార్త చెప్పటానికి భర్త కోసం ఎదురు చూస్తూ కూర్చుంది శాంత. ★

[అతి సామాన్యంగా కనిపించే కొన్ని విషయాలు ఎప్పుడో ఒకప్పుడు ఎలాంటి వారికికూడా మనస్తాపాన్ని కలిగిస్తాయి. ఏదో ఒక విధంగా ఆ పని జరిగిపోతే చాలా లైట్‌గా ఫీల్ అవుతారు. ఎంత భాగ్యవంతుడయినా ఎప్పుడో ఒకప్పుడు ఒక్క పైసా కోసం వెతుక్కోవలసి వస్తుంది.

—రచయిత్రి

మతిక్రమం ఆలస్యమైతే?

తిరిగిపడవద్దు తక్షణశాంతిని "దేవిపిల్సు" వాడండి

'దేవి పిల్సు ముఖ్యంగా ఆలస్యమైనా, క్రమముగాకాక పోయిన, బాధతో కూడిన, లేక అదిపోయినబహిష్టుకు దేవిపిల్సు బాగుగ గుణమిచ్చును



ప్రతిచోటదొరకును

2 పట్టీలలోపు ఉపయోగమునను ఎట్టిహాని కలిగింపదు.

FULL COURSE 28 TABLETS Rs.11/-
HALF COURSE 14 TABLETS Rs.5/-

Mfrs:- SEENU & Co., MADRAS-81

సింగర్
చల్లగాలితో
ఉల్లాసంగా
ఉండండి



రంగు రంగుల క్రొత్త సింగర్ ఫ్యానులు మీకు సమీపంలో యున్న సింగర్ షాపులో లేక డీలరు వద్ద చూడండి.

సింగర్ మంది వస్తువులకు పుట్టినిల్లు

*సింగర్ కంపెనీ యొక్క రిజిస్టర్డ్ ట్రేడ్ మార్క్.

maa. ssm. 1197 .TEL.

ఇప్పుడు

సింగర్
డ్రీమ్ హౌస్ పోటీలో చేరండి

ఎంట్రీ ఫారములు మీ ఊళ్ళో ఉన్న సింగర్ షాపు వద్ద లేదా అధికారము పొందిన డీలరు వద్ద లభిస్తాయి.